

పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న ఈఓ



విశేష అలంకరణలో దర్శనమిస్తున్న స్వామి, అమ్మవార్లు

## శ్రీగిరిపై ముగిసిన ఉగాది ఉత్సవాలు

- అశ్వవాహనంపై విహరించిన శివపార్వతులు
- నిజరూప అలంకరణలో భ్రమరాంబదేవి దర్శనం
- యాగ పూర్ణాహుతితో వేడుకల ముగింపు

శ్రీశైలం, ఏప్రిల్ 9: శ్రీశైల మహాక్షేత్రంలో బుధవారం ఉగాది మహోత్సవాలకు అర్చకులు, వేదపండితులు యాగపూర్ణాహుతి నిర్వహించారు. కార్యక్రమంలో ముందుగా స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు జరిపించి అనంతరం స్వామివారి యాగశాలలో చండీశ్వరస్వామికి ప్రత్యేక పూజాధికాలు చేశారు. లోకకల్యాణం కోసం జపాలు, నిత్యహోమబలిహరణలు, రుద్ర హోమం, జయాదిహోమం జరిపించారు. అదేవిధంగా అమ్మవారి ఆలయ యాగశాలలో చండీ హోమం జరిపారు. తరువాత యాగపూర్ణాహుతి, వసంతోత్సవం, అవబృథం, త్రిశూల స్నానం నిర్వహించారు. పూర్ణాహుతి కార్యక్రమంలో శాస్త్రోక్తంగా నారికేళాలు, పలుసుగంధ ద్రవ్యాలు, ముత్యం, పగడం, నూతన వస్త్రాలు మొదలైన ద్రవ్యాలను హోమగుండంలోకి ఆహుతిగా సమర్పించి యాగపూర్ణాహుతి కార్యక్రమాన్ని పూర్తిచేశారు. అర్చకులు, వేదపండితులు వసంతోత్సవం జరిపించి (మంత్రపూరిత జలం) సమంత్రకంగా భక్తులపై సంప్రోక్షించారు. అనంతరం చండీశ్వరస్వామికి మల్లికా గుండంలో అవబృథం, త్రిశూలస్నానం నిర్వహించారు. ఈ అవబృథంలో రుద్రధ్యాయ మంత్రాలతో చండీశ్వరస్వామికి శుద్ధజలం, పంచామృతాలు, భస్మోదకం, కుంకుమోదకం, హరిద్రోదకం, బిల్వోదకం, పుష్పోదకం, నారికేళోదకం మొదలైన వాటితో స్నపన కార్యక్రమం నిర్వహించారు. చివరగా పుష్కరిణిలో త్రిశూల స్నానం జరిపించారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో డి. పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.



స్వామివారికి త్రిశూల స్నానం

### నిజరూపాలంకరణలో భ్రమరాంబదేవి అమ్మవారు

ఉగాది మహోత్సవాల్లో భాగంగా చివరి రోజు అమ్మవారు భ్రమరాంబ దేవి నిజాలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అష్టభుజాలు కలిగిన ఈ దేవి శూలం, బాకు, గద, ఖడ్గం, విల్లు, డాలు, పరిగ మొదలైన ఆయుధాలను ధరించి జగన్మాతగా దర్శనమిచ్చారు. అమ్మవారి నిజాలంకరణ దర్శనం వలన సమస్యలన్నీ తొలగిపోయి, సకల శుభాలు కలుగుతాయని చెప్పబడుతోంది. కాగా పూజాధికాల తరువాత ఆలయ ప్రాంగణంలో ప్రదక్షణగా ఉత్సవమూర్తులకు ప్రాకారోత్సవం నిర్వహించారు. ఈ ప్రాకారోత్సవంతో ఉగాది మహోత్సవాలు ముగాశాయి.



అశ్వవాహనంపై విహరిస్తున్న మల్లికార్జునస్వామి, భ్రమరాంబదేవి

### అశ్వ వాహనంపై ఆదిదంపతుల విహారం

ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు భ్రమరాంబ సమేత మల్లికార్జునుడు అశ్వవాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఉదయం స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ పాంగణంలోని అక్కమహదేవి అలంకార మండపములో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన అశ్వావాహనంపై ఆశీనులను చేసి అర్చకులు, వేదపండితులు విశేష పూజలు జరిపారు. అనంతరం అశ్వావాహనసేవను మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణంలో ఉత్సవం నిర్వహించారు. ఉత్సవం ఎదుట కళాకారులు, డప్పు వాయిద్యాలు, శంఖు, ఢమరుక నాదాలు, నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో దేవస్థానం ఈవో డి.పెద్దిరాజు, అర్చకులు, వేద పండితులు, భక్తులు పాల్గొన్నారు.

# అంతా ఇన్‌డైరెక్టే

వైసీపీ అధికారం చేపట్టగానే ఈఫామ్ మార్కెట్‌ను అమలులోకి తెస్తున్నామని గొప్పగా చెప్పుకుంది. కమీషన్ ఏజెంట్ల ప్రమేయం లేకుండా రైతులే నేరుగా వ్యాపారులకు తమ పంట ఉత్పత్తులను అమ్ముకోవచ్చని తెలిపింది. అయితే.. ఈఫాం మార్కెట్‌తో పాటు డైరెక్టు సేల్ విధానాలు కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని మార్కెట్ యార్డుల్లో బోర్డులకే పరిమితమైపోయాయి. దీంతో కమీషన్ ఏజెంట్లు తమ గుత్తాధిపత్యాన్ని యథావిధిగా కొనసాగిస్తున్నారు. పాలకులు, అధికారుల మద్దతుతో రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు. ప్రభుత్వాలు ఎన్ని మాటలు చెప్పినా అన్నదాతలు చివరకు కమీషన్ ఏజెంట్ల చేతుల్లో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. దీంతో ఎప్పటి నుంచో అమలవుతున్న కార్యక్రమాలకు పాతర వేయడం తప్పితే కొత్త వాటి వల్ల తమకు ఒరిగిందేముందని అన్నదాతలు పెదవి విరుస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను కాపాడాలనుకుంటే ఈఫామ్ మార్కెట్‌ను, డైరెక్టు సేల్ విధానాలను అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- డైరెక్టు సేల్ విధానానికి పాతర
- కొత్తగా ఈ-ఫామ్ మార్కెట్లని చెప్పిన జగన్
- కమీషన్ ఏజెంట్లదే గుత్తాధిపత్యం..
- రైతులపై యథావిధిగా కమీషన్ భారం
- రెండు శాతం చెల్లిస్తేనే పంట ఉత్పత్తుల విక్రయం
- ఏటా రూ.100 కోట్లు కోల్పోతున్న అన్నదాతలు
- నేరుగా కొనుగోళ్లతో రైతుకు ఎంతో ప్రయోజనం



కమిషన్ ఏజెంట్ల షాపుల ముందరే రైతులు తెచ్చిన వేరుశనగ నిలువలు



కర్నూలు(అగ్రికల్చర్), ఏప్రిల్ 10: ఈ రైతు పేరు ఎల్లప్ప, క్రిష్ణగిరి మండలం. తన కున్న ఐదెకరాల్లో వేరుశనగ పంటను సాగు చేశాడు. గిట్టుబాటు ధర అందుతుందనే ఆశతో కర్నూలు మార్కెట్ యార్డుకు వేరుశనగ కాయలను అమ్మకానికి తీసుకువచ్చాడు. మార్కెట్ యార్డులో డైరెక్ట్ సేల్ బోర్డును చూసి అధికారులను ఆశ్రయించాడు. అయితే.. ఈ విధానం అమలు కావడం లేదని తేల్చి చెప్పడంతో మరో దారి లేక తిరిగి కమీషన్ ఏజెంట్ వద్దకే వెళ్లాల్సి వచ్చింది. ఆ ఏజెంట్ రెండు శాతం కమీషన్ తీసుకుని రైతును తెచ్చిన ఉత్పత్తులను వ్యాపారికి అప్పగించాడు. వేరుశనగ కాయలు అమ్మినందుకు ఆ రైతుకు డబ్బులను వెంటనే కమీషన్ ఏజెంట్ చెల్లించాలి. అయితే. వారం రోజులకు పైబడి గడిచిపోయినా డబ్బులు రాకపోవడంతో ఆ రైతు పరిస్థితి దయనీయంగా మారింది. ఇలా కర్నూలు, నంద్యాల జిల్లాలోని రైతులంతా ప్రస్తుతం మార్కెట్ యార్డుల్లో డైరెక్టు సేల్‌తో పాటు ఈ-ఫామ్ మార్కెట్ అమలు కాకపోవడం వల్ల కమీషన్ ఏజెంట్ల అక్రమాలకు బలవుతున్నారు.

రైతుల కోసమంటూ కొత్త కొత్త పథకాలను అమల్లోకి తేవడం తప్ప.. వాటి అమలుకు చర్యలు తీసుకోకపోవడం వల్ల రైతులు కమీషన్ ఏజెంట్ల చేతుల్లో భారీగా దోపిడీకి గురవుతున్నారు. దీంతో ఎప్పటి నుంచో అమలవుతున్న కార్యక్రమాలకు పాతర వేయడం తప్పితే కొత్త వాటి వల్ల తమకు ఒరిగిందేముందని అన్నదాతలు పెదవి విరుస్తున్నారు. రెండేళ్ల కిందట ప్రభుత్వం రైతులు పండించిన పంట ఉత్పత్తులను వారి గ్రామాల్లోనే వ్యాపారుల చేత కొనుగోలు చేయించేలా ఈ-ఫామ్ మార్కెట్లను అమల్లోకి తెచ్చింది. అయితే.. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 1600 గ్రామాలకు పైగా ఉంటే.. పది గ్రామాల్లో మాత్రమే ఈఫామ్ మార్కెట్ విధానాన్ని నామమాత్రంగా అమలు చేస్తున్నారు. గతంలో పంట ఉత్పత్తుల కొనుగోలు నేరుగా వ్యాపారుల చేతనే చేపట్టేందుకు డైరెక్టు సేల్ (ప్రత్యక్ష అమ్మకం) విధానాన్ని అమలులో ఉండేది. అయితే.. దీని వల్ల తాము నష్టపోతామనే భయంతో కమీషన్ ఏజెంట్లు.. రాజకీయ నాయకులు, మార్కెటింగ్ శాఖ అధికారులపై ఒత్తిడి తెచ్చి డైరెక్టు సేల్ విధానం అమలు కాకుండా చేశారు.

### డైరెక్టు సేల్ కాదని ఈ-ఫామ్ మార్కెట్

రైతులు మార్కెట్ యార్డులకు తెస్తున్న పంట దిగుబడులను వ్యాపారులకు అమ్మించే కమీషన్ ఏజెంట్ల వ్యవస్థ మార్కెట్ యార్డుల్లో ఎప్పటి నుంచో అమల్లో ఉంది. నిబంధనల ప్రకారం కమీషన్ ఏజెంట్లు రైతుల నుంచి పంట ఉత్పత్తుల అమ్మకాలపై రెండు శాతం కమీషన్ వసూలు చేయాలి. ఎటువంటి అక్రమాలకు పాల్పడకూడదు. అయితే.. రాజకీయ నాయకులు, అధికారుల నిర్లక్ష్యం, మామూళ్ల కారణంగా అక్రమాలు జోరు రోజురోజుకూ ఎక్కువైపోతున్నాయి. ఎలక్ట్రానిక్ కాటాల్లో వాస్తవ తూకం కంటే తక్కువగా చూపడంతోపాటు ఇతర మార్గాల ద్వారా యార్డుల్లో కమీషన్ ఏజెంట్ల అక్రమాల జోరు పెరిగిపోయింది.

### ఎలాంటి కమీషన్ ఇవ్వాల్సిన అవసరం లేదు..

ఈ డైరెక్టు సేల్ విధానం వల్ల కమీషన్ ఏజెంట్లకు రైతులు ఎటువంటి కమీషన్ ఇవ్వాల్సిన అవసరం ఉండదు. ప్రస్తుతం పంట ఉత్పత్తులపై కమీషన్ ఏజెంట్లు రైతుల నుంచి రెండు నుంచి నాలుగు శాతం కమీషన్‌ను వసూలు చేస్తున్నారు. జిల్లా మొత్తం మీద ఏటా కమీషన్ రూపంలో రైతులు సంవత్సర కాలానికి చెల్లిస్తున్న మొత్తాన్ని అంచనా వేస్తే దాదాపు రూ.100 నుంచి రూ.150 కోట్ల దాకా ఉంటుంది. ప్రభుత్వం రైతులపై మోపుతున్న ఈ మొత్తం భారాన్ని పూర్తిగా తగ్గించేందుకు, ఇతర అక్రమాలను నిరోధించేందుకు ఈ-ఫామ్ మార్కెట్‌తోపాటు డైరెక్టు సేల్ విధానాన్ని ఉమ్మడి జిల్లాలోని 15 మార్కెట్ యార్డుల్లో అమలు చేయాలని రైతులు కోరుతున్నారు.

### నత్తను తలపిస్తున్న ఈ-ఫామ్ మార్కెట్లు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో రైతులు పండించిన పంట ఉత్పత్తులను అమ్ముకునేందు కోసం 15 మార్కెట్ యార్డులను ఏర్పాటు చేశారు. కర్నూలు, ఆదోని, నంద్యాల, ఎమ్మిగనూరు, ఆళ్లగడ్డ, డోన్, నందికొట్కూరు, ఆత్మకూరు, బనగానపల్లె, కోవెలకుంట్ల, ఆలూరు, పత్తికొండ, కోడుమూరు, పాణ్యం, కోసిగి కేంద్రాల్లో రైతులు తమ పంట ఉత్పత్తులను వ్యాపారులకు అమ్ముకునేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రారంభంలో డైరెక్టు సేల్ విధానం అమలైంది. దీని వల్ల ప్రభుత్వానికి ఒక శాతం కమీషన్ మాత్రమే చెల్లించేవారు. డైరెక్టు సేల్ విధానం వల్ల తమకు భారీగా నష్టం జరగనుండడంతో కమీషన్ ఏజెంట్లు, రాజకీయ నాయకులు మార్కెట్ కమిటీల అధికారులపై ఒత్తిడి తెచ్చి డైరెక్టు సేల్ పథకం అమలు కాకుండా చేశారు. ప్రస్తుతం ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఏ మార్కెట్ యార్డులో కూడా డైరెక్టు సేల్ అమలు కావడం లేదు.

### బోర్డుకే పరిమితమైన డైరెక్టు సేల్ విధానం

కర్నూలు మార్కెట్ యార్డులో డైరెక్టు సేల్ విధానం బోర్డుకే పరిమితమైంది. రైతులు డైరెక్టుగా కమీషన్ ఏజెంట్ల వద్దకే వెళ్లి పంట ఉత్పత్తులను వారి షాపుల వద్ద నిల్వ చేసి విక్రయించాల్సిన పరిస్థితి ప్రస్తుతం నెలకొంది. దీని వల్ల కమీషన్ ఏజెంట్లు 2 నుంచి 4 శాతం కమీషన్‌ను రైతుల నుంచి వసూలు చేయడమే కాకుండా మరోవైపు వ్యాపారుల నుంచి కూడా లబ్ధి పొందుతున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో కోడుమూరు, మంత్రాలయం, ఆలూరు, ఆదోని, పత్తికొండ నియోజకవర్గాల్లో పది గ్రామాల్లో మాత్రమే ఈ-ఫామ్ మార్కెట్ పథకాన్ని అమలు చేస్తున్నారు. ఈ ఆరు నియోజకవర్గాల్లో కూడా పట్టుమని ఒక శాతం రైతులు కూడా లబ్ధి పొందలేని పరిస్థితి. ఇప్పటికైనా ఈఫామ్ మార్కెట్ విధానాన్ని అమలు చేయాలని రైతులు కోరుతున్నారు.

రాష్ట్రంలోనే పత్తి విక్రయాల్లో గుర్తింపు పొందిన ఆదోని మార్కెట్ యార్డుల్లో ఒక శాతం కమీషన్ వసూలు చేయాల్సిన ఏజెంట్లు ఏకంగా నాలుగు శాతానికిపైగా వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. అదేవిధంగా కర్నూలు, ఎమ్మిగనూరు మార్కెట్ యార్డుల్లోనూ 2 నుంచి 4 శాతం కమీషన్‌ను రైతుల నుంచి అన్యాయంగా వసూలు చేస్తున్నారు. వీటన్నింటికీ చెక్ పెట్టేందుకు గతంలో డైరెక్టు సేల్ విధానాన్ని అమలు చేశారు. ఈ విధానం వల్ల రైతులు మార్కెట్ యార్డుల్లోనే కమీషన్ ఏజెంట్ల ప్రమేయం లేకుండా వ్యాపారులకే పంట ఉత్పత్తులను విక్రయించవచ్చు. ఈ విధానం అమలుకు మార్కెటింగ్ శాఖ అధికారులతోపాటు ఆయా మార్కెట్ యార్డుల అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాల్సి ఉంది. మొదట్లో ఈ పద్ధతి రెండు మూడు సంవత్సరాలపాటు అమలైంది. ఆ తరువాత కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని 15 మార్కెట్ యార్డుల్లో ఎక్కడా ఆ ఊసే లేదు. దీంతో ప్రస్తుత ప్రభుత్వం ఈ విధానానికి పాతర వేసి కొత్త విధానాన్ని తెరపైకి తెచ్చింది. రెండేళ్ల కిందట ఈ-ఫామ్ మార్కెట్ పేరుతో కొత్త పథకాన్ని అమల్లోకి తెచ్చింది. అయితే.. ఈ పథకం వల్ల ప్రస్తుతం పది గ్రామాల్లో మాత్రమే అరకొరగా రైతులు లబ్ధి పొందుతున్నారు. డైరెక్టు సేల్ లేదా ఈఫామ్ పథకాల్లో ఏదో ఒకదానిపై దృష్టి సారించి ప్రభుత్వం రైతులకు న్యాయం చేయగలిగితే కమీషన్ ఏజెంట్లకు ఏడాదికి చెల్లిస్తున్న రూ.100-150 కోట్లు రైతులకు మిగిలిపోయే అవకాశం ఉంది.

### ఈ-ఫామ్ మార్కెట్‌ను అమలు చేస్తాం

ఈ-ఫామ్ మార్కెట్ డైరెక్టు సేల్ విధానానికి బదులు ప్రస్తుతం ప్రభుత్వం ఈ-ఫామ్ మార్కెట్ విధానాన్ని అమల్లోకి తెచ్చింది. ఈ విధానంలో వ్యాపారులు గ్రామాలకే వెళ్లి రైతుల నుంచి పంట దిగుబడులను కొనుగోలు చేస్తారు. దీని వల్ల రైతులు ఎటువంటి కమీషన్ చెల్లించాల్సిన అవసరం ఉండదు. మరోవైపు రవాణా ఖర్చులు కూడా ఆదా అవుతాయి. ప్రస్తుతం కర్నూలు జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో కొన్ని గ్రామాల్లో ఈ పథకాన్ని అమలు చేస్తున్నాం. త్వరలోనే అన్ని గ్రామాల్లో అమలు చేసేలా చర్యలు తీసుకుంటాం.

- ఏడీఎం నారాయణ మూర్తి



నంది వాహనంపై విహరిస్తున్న స్వామివారు

### కన్నడ భక్తులతో పోటెత్తిన మహానంది

మహానంది, ఏప్రిల్ 10: బుధవారం వేలాదిమంది కన్నడ భక్తులతో మహానంది క్షేత్రం నిండి పోయింది. కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి ప్రధాన ఆలయాల్లోని స్వామి అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. కన్నడ భక్తులకు వివిధ కులసంఘాల తరపున అన్నదానం చేశారు. కన్నడ భక్తులకు ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. వేసవి ఎక్కువగా ఉండటంతో సుదూర ప్రాంతం నుంచి వచ్చే భక్తులకు ఎంపీహెచ్ఈఓ హుసేన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉచితంగా మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం హేమ, సునీత, వెంకటలక్ష్మి, కుమారి పాల్గొన్నారు.

**వైభవంగా నంది వాహన సేవ:** మహానంది ఆలయంలో కన్నడ ఉగాది పర్వదినం పురస్కరించుకొని బుధవారం ఉదయం నందివాహన సేవను నిర్వహించారు. ముందుగా ఆలయంలో ఉత్సవమూర్తుల విగ్రహాలకు పూజలు చేసి నంది వాహనంపై మహానందీశ్వరుని ఉత్సవమూర్తిని ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి, సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

## ధార్మిక మార్గం

- ముగిసిన 30 రోజుల ఉపవాస దీక్షలు
- నేడు ఈద్-ఉల్-ఫితర్



పండుగ సామగ్రిని కొనుగోలు చేస్తున్న ముస్లింలు

నంద్యాల (కల్చరల్), ఏప్రిల్ 10: పవిత్ర రంజాన్‌కు సంకేతంగా బుధవారం ఆకాశంలో నెల వంక కనిపించింది. మానవాళి ధార్మిక జీవితానికి దిశా నిర్దేశం చేసే రంజాన్ వేడుకలను గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకోనున్నారు. 30 రోజుల ఉపవాసం దీక్షలు ఆదివారం నెలవంక దర్శనంతో ముగిశాయి. ఈద్-ఉల్-ఫితర్ (రంజాన్)కు జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. ఆయా ఈద్గాల వద్ద గురువారం ఉదయం 9.00 గంటలకు భక్తులు ప్రత్యేక సమాజ్ చేయడానికి ఏర్పాట్లు చేశారు. ఎస్ఆర్‌బీసీ కాలనీ ఈద్గా (తయ్యబా ఈద్గా), భీమవరం రోడ్డులోని ఈద్గా(ఆల్‌ఫుర్‌ఖాన్‌ఈద్గా), బొమ్మలసత్రం మసీదు ఈద్గా, తిక్కస్వామి దర్గా వద్ద గల ఈద్గాల వద్ద ప్రార్థనలు నిర్వహిస్తున్నట్లు నంద్యాల జిల్లా ఇమామ్‌ల సంఘం అధ్యక్షుడు అంజద్‌బాషా సిద్ధిఖీ తెలిపారు.

**● ఆధ్యాత్మిక చింతనే రంజాన్ సారం**

మానవుల్లో ఆధ్యాత్మిక చింతన పెంచడమే రంజాన్ లక్ష్యం. నెల రోజుల పాటు పగలంతా ఉపవాసం ఉండి, ఐదు పూటల నమాజ్ చేస్తారు. పవిత్ర ఖురాన్ గ్రంథాన్ని పఠిస్తారు. పేదలకు దానం చేయమని రంజాన్ ఉద్బోధిస్తుంది. ఇస్లాం ధార్మిక ప్రపంచానికి ఉపవాసం, ప్రార్థన, దానం మూల స్తంభాలు. రంజాన్ మాసంలోనే పవిత్ర ఖురాన్ గ్రంథం అవతరించిందని నమ్మకం.

## బ్లాక్‌లో మద్యం విక్రయాలు





పలుకూరులోని మద్యం దుకాణం

బనగానపల్లె, ఏప్రిల్ 10: బనగానపల్లె మండలం పలుకూరు గ్రామంలో ఎక్సైజ్ శాఖ నిర్వహిస్తున్న మద్యం దుకాణంలో బ్లాక్‌లో మద్యం విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉగాది మరుసటి రోజు బుధవారం మందు దొరకక పలువురు మద్యం దుకాణం ఎదుట ఆందోళనకు దిగారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో నిబంధనల ప్రకారం ఒక్కో వ్యక్తికి ఒక మద్యం సీసానే ఇవ్వాలి. కాని పలుకూరు మద్యం దుకాణంలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది తమకు అనుకూలమైన బెల్టు దుకాణం నిర్వాహకులకు ఒక మద్యం సీసాల కేస్(ఇందులో 48 మద్యం సీసాలు ఉంటాయి) అమ్మి అదనంగా రూ.500 నుంచి రూ.600 వసూలు చేస్తున్నట్లు గ్రామంలోని పలువురు వాపోయారు. బెల్టు దుకాణదారులు రూ.150 ఉన్న మద్యం సీసాని రూ.250కు విక్రయిస్తున్నారని మద్యం ప్రియులు ఆరోపిస్తున్నారు. ఇక్కడ పనిచేసే సిబ్బంది బెల్టు దుకాణదారులకు సహకరిస్తూ తమకు అన్యాయం చేస్తున్నారని మద్యం ప్రియులు ఆవేదన వ్యక్తం చేశారు. గని కార్మికులకు మద్యం దొరకకపోవడంతో బుధవారం దుకాణం ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. ఒక గంటలోనే మద్యం అయిపోయిందని చెప్పి, బ్లాక్‌లో విక్రయించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

**బెల్టు దుకాణదారులకు విక్రయిస్తే కఠిన చర్యలు: ఎక్సైజ్ సీఐ రామకృష్ణారెడ్డి**

ఎన్నికల నియమ నిబంధనల ప్రకారం ఒకరికి ఒక బాటిల్ అమ్మాలి. ఎన్నికల నియమ నిబంధనల మేరకు రోజుకు రూ.2.36 లక్షల మద్యం మాత్రమే విక్రయించాలన్న నిబంధన ఉంది. బెల్టు దుకాణం దారులకు పలుకూరులో విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు అందాయి. సిబ్బందిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం.

## శ్రీశైలంలో ఎస్పీ ఆకస్మిక తనిఖీలు

శ్రీశైలం, ఏప్రిల్ 10: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ అంతరాష్ట్ర చెక్‌పోస్టును బుధవారం నంద్యాల ఎస్పీ కె. రఘువీర్‌రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. తెలంగాణ నుంచి శ్రీశైలంలోని ప్రవేశించు మార్గంలో లింగాల గట్టు వద్ద గల అంతరాష్ట్ర చెక్‌పోస్టును ఆయన సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోవు ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని సిబ్బంది అంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. నగదు, బంగారు, వెండి, మద్యం అక్రమంగా రవాణ జరగకుండా ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, ఏదైనా సంఘటన జరిగినప్పుడు అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ తనిఖీల్లో ఆత్మకూరు డీఎస్పీ ఎ.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## 12న ఈవీఎంల ర్యాండమైజేషన్

- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కె.శ్రీనివాసులు

నంద్యాల (కల్చరల్), ఏప్రిల్ 10: ఈవీఎంల మొదటి దశ రాండమైజేషన్‌ను ఈ నెల 12వ తేదీన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నిర్వహిస్తామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.కె.శ్రీనివాసులు అన్నారు. బుధవారం కలెక్టర్ చాంబర్‌లో ఎన్నికల నిర్వహణ, ఈవీఎంల మొదటి దశ రాండమైజేషన్‌పై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 12న ఈవీఎంల మొదటి రాండమైజేషన్, 13వ తేదీ అసెంబ్లీ నియోజకవర్గంలో రిటర్నింగ్ అధికారి స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంల మొదటి దశ ర్యాండమైజేషన్ జరుగుతుందన్నారు. ఇంటింటి ప్రచారానికి అనుమతులు అవసరం లేదన్నారు. కరపత్రాలు ముద్రించి పంపిణీ చేస్తే నిబంధనల మేరకు ముందస్తు అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఈ నెల 18 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని వెల్లడించారు. ఓటర్లకు సంబంధించి ఫాం-6ను ఈ నెల 15 వరకు స్వీకరిస్తామని చెప్పారు. జిల్లా ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్‌రూమ్ తనిఖీ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన జిల్లా ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్‌ను కలెక్టర్ డా.కె.శ్రీనివాసులు బుధవారం పరిశీలించారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో పోల్‌డే మానిటరింగ్, రిపోర్ట్స్ మానిటరింగ్, సోషల్ మీడియా సెల్, మీడియా మానిటరింగ్, వెబ్ కాస్టింగ్, ఎక్స్‌పెండిచర్ మానిటరింగ్, ఎంసీసి టీంలను సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీనివాసులు



# పిడకల సంబరం..

- ఉత్కంఠభరితంగా సాగిన పిడకల సమరం
- కైరుప్పల గ్రామంలో నుగ్గులాట
- 20 మందికి గాయాలు

దేవతల పెళ్లిలో వింత ఆచారం





అలంకరణలో వీరభద్రస్వామి, భద్రకాళి అమ్మవారు

**ఆదోని/ఆస్పరి, ఏప్రిల్ 10:** ఆస్పరి మండల పరిధిలోని కైరుప్పల గ్రామంలో బుధవారం పిడకల సమరం అత్యంత ఉత్కంఠంగా సాగింది. ఏటా సంప్రదాయ బద్ధంగా జరిగే ఈ పిడకల సమరంలో వీపులు కందిపోయి, తలలకు గాయాలైనా లెక్క చేయకుండా రాసులుగా పోసిన పిడకలన్నీ అయిపోయే వరకు కొట్టుకుంటూ గ్రామస్థులు ఆనందంతో మునిగితేలారు. కైరుప్పలలో వీరభద్ర స్వామి కల్యాణోత్సవం సందర్భంగా నిర్వహించే పిడకల సమరానికి పౌరాణిక నేపథ్యం ఉంది. వేట కోసం వచ్చిన వీరభద్రస్వామి కాళికాదేవిని చూసి ప్రేమలో పడతాడు. భద్రకాళి దేవితో ఏర్పడిన మనస్పర్థలతో వివాదం తలెత్తుతుంది. ఆ సందర్భంగా వారి వర్గీయుల మధ్య గొడవ జరిగి, అందుబాటులో ఉన్న పిడకలతో పరస్పరం కొట్టుకోగా, అదే సంప్రదాయాన్ని నేటికీ ఉత్సవ రూపంలో ఆచరిస్తున్నారు. కారుమంచి గ్రామానికి చెందిన పెద్దరెడ్డి వంశస్థులు ఉత్సవ నిర్వహణలో ప్రధాన పాత్ర పోషించారు. ఈ వంశస్థుల్లో ఒకరైన చిన్నారెడ్డి కుమారుడైన నరసింహారెడ్డి రాజరికాన్ని గుర్తు తెచ్చేలా ప్రత్యేక వస్త్రాధారణతో సాయంత్రం 5 గంటల సమయంలో గుర్రంపై మందీమార్బలం, తప్పెట్లు మేళతాళాలతో ఊరేగింపుగా కైరుప్పల గ్రామం చేరుకున్నారు. అనంతరం వీరభద్రస్వామి, కాళికాదేవిలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తమ ముఖాలకు స్వామి వారి విభూది రాసుకుని, తిరిగి వెళ్లగానే పిడకల సమరం ప్రారంభానికి సూచికగా భక్తులు పెద్ద ఎత్తున బాణసంచా పేల్చారు.

### రెండు వర్గాలుగా విడిపోయి..

పిడకల సమరంలో భాగంగా భక్తులు రెండు వర్గాలుగా విడిపోయారు. ఒక వర్గం భద్రకాళీదేవి తరుపున, మరొక వర్గం వీరభద్రస్వామి తరుపున సిద్ధమై ఆలయ ఆవరణలో రాసులుగా పోసిన పిడకలతో పరస్పరం కొట్టుకున్నారు. వందల సంఖ్యలో పిడకలు గాల్లోకి లేచి ప్రత్యర్థి వర్గాలపై పడుతుంటే ఉత్సాహం రెట్టింపు అయింది. పిడకల సమరంలో దుమ్ము ఆకాశాన్ని అంటింది. తమను తాము రక్షించుకుంటూ, ఎదుటివారిపై పిడికలు విసురుకుంటూ గుంపులు, గుంపులుగా వర్గీయులు కదిలారు. ఒకసారి ఒకవర్గానిది పైచేయి కాగా, మరోసారి మరోవర్గం వారిది పైచేయిగా నిలిచింది. తమ వర్గం వారు గెలవాలన్న తపనతో మహిళలు మేము సైతం అంటూ తమ వర్గీయులకు పిడకలు అందిస్తూ, సాయంగా నిలిచారు. రాసిగా వేసిన పిడకలు పూర్తిగా అయిపోయేంతవరకు గంట పాటు పోరు కొనసాగింది. పిడకల దెబ్బలకు కొందరి తలకు గాయాలు కాగా, మరి కొందరికి శరీరాలు కందిపోయాయి. సుమారు 20 మందికి గాయాలైనట్లు అంచనా.. సంగ్రామం ముగిసిన తరువాత గ్రామపెద్దలు ఆంజనేయస్వామి దేవాలయం దగ్గర పంచాయితీ చేసి, కాళికాదేవి, వీరభద్రస్వామి వివాహానికి అంగీకారం తెలిపారు. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు తెలంగాణ రాష్ట్రంతో పాటు, కర్నాటక, మహారాష్ట్ర రాష్ట్రాలకు చెందిన వేలాది మంది భక్తులతో పాటు కైరుప్పల చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాది మంది ప్రజలు తరలివచ్చారు.



పిడకల సమరంలో కొట్టుకుంటున్న ఇరువర్గాలు, ఉత్సవంలో గాయపడ్డ యువకుడు

### పోలీసుల ప్రత్యేక బందోబస్తు...

పిడకల సమరంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఉండేందుకు ముందుజాగ్రత్త చర్యగా పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసు రెడ్డి ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేశారు. ఆస్పరి, ఆలూరు, దేవనకొండ సీఐలు హనుమంతప్ప, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులుతో పాటు ఐదు మంది ఎస్ఐలు, 50మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. ఈ ఉత్సవంలో ఆలయ ఈవో రామ్‌ప్రసాద్, సర్పంచ్ తిమ్మక్క, డైరెక్టర్ టీ.టెక్ బద్రి, ఎంపీటీసీ లక్ష్మీ, లక్ష్మన్న, మాజీ సర్పంచ్ శరవన్న, మాజీ ఎంపీటీసీ రవీంద్ర, మాజీ డైరెక్టర్ ఉరుకుంద, బంట్రోతు శీనప్ప, వీరేష్, గోపాల్, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## నగదు పట్టివేత



స్వాధీనం చేసుకున్న అక్రమ నగదును చూపుతున్న డీఎస్పీ శివనారాయణ స్వామి

**ఆదోని, ఏప్రిల్ 10:** సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులో భాగంగా ఆదోని రైల్వేస్టేషన్ వద్ద ఎలాంటి ఆధారాలు లేని రూ.37 లక్షల నగదును బుధవారం పోలీసులు పట్టుకున్నారు. కల్లుబావి కాలనీకి చెందిన మల్లికార్జున అనే వ్యక్తి ఆదోని నుండి కేరళకు వెళ్లేందుకు రైల్వేస్టేషన్ చేరుకున్నాడు. అదే సమయంలోనే టూటౌన్ సీఐ గోపీనాథ్, ఫ్లయింగ్ స్క్వాడ్ హరేంద్ర అనుమానాస్పద స్థితిలో తచ్చాడుతున్న మల్లికార్జునను గుర్తించి అతని బ్యాగును సోదా చేశారు. అందులో రూ.37 లక్షలు నగదు ఉన్నట్లు గుర్తించారు. అందుకు ఎలాంటి ఆధారాలు లేకపోవడం వల్ల ఆ నగదును సీజ్ చేసినట్లు డీఎస్పీ శివనారాయణ స్వామి తెలిపారు. ఈ నగదును ఇన్‌కమ్ టాక్స్ డిపార్ట్‌మెంట్‌కు అప్పగిస్తామని అన్నారు.

## 264 మంది వలంటీర్ల రాజీనామా

**కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 10:** జిల్లాలో 11 మండలాల్లో బుధవారం నాటికి 264 మంది గ్రామ, వార్డు సచివాలయ వలంటీర్లు రాజీనామా చేశారని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.సృజన తెలిపారు. ఆస్పరిలో ఒకరు, ఆదోనిలో (5), కర్నూలు (1), పత్తికొండలో (32), కృష్ణగిరి (59), మద్దికెర (48), వెల్దుర్తి (37), తుగ్గలి (23), హాలహర్వి (1), ఓర్వకల్లులో (44), ఆలూరు (13) మంది.. మొత్తం 264 మంది వలంటీర్లు రాజీనామా చేశారని కలెక్టర్ వెల్లడించారు.

## ప్రధాన పంట కాల్వకు గండి

మరమ్మతులకు నోచుకోని పంటకాల్వలు



అవుకు సమీపంలో ప్రధాన పంట కాల్వకు గండి

**అవుకు, ఏప్రిల్ 10:** అవుకు రిజర్వాయర్ అంతర్భాగమైన తిమ్మరాజు స్లూయిస్ నుంచి విడుదలయ్యే సాగునీటిని లోకల్ ఆయకట్టుకు తరలించే ప్రధాన కాల్వకు గండిపడింది. చాలా కాలంగా ఆలనపాలన లేక బుధవారం ఉదయం 11గంటల ప్రాంతంలో ఈ ప్రధాన కాల్వ కుంగిపోయి 10 అడుగుల మేర గండిపడింది. ఈ కాల్వ కింద 1614 ఎకరాల పొలం సాగవుతోంది. ఈ రబీ సీజన్‌లో రైతులు వరి పంటను సాగుచేశారు. స్లూయిస్ నుండి వస్తున్న నీరు గండిపడ్డ ప్రాంతం నుండి వరి పొలాల్లోకు వెళ్తుండడంతో రైతులు స్లూయిస్ గేట్లను మూసివేశారు. పంట కాల్వల్లోపూడిక చేరి ముళ్ల పొదలతో మూసుకుపోయాయి. పంట కాల్వకు 80శాతం మేర ఇరువైపుల రాతి కట్టడాలు లేకపోవడంతో రంధ్రాలు పడి నీరు వృథాగా పోతోంది. రంధ్రాలు పూడ్చుకునేందుకు రైతులు పడరాని పాట్లుపడుతున్నారు. ఈ గండిని ఎస్సార్బీసీ అధికారులు వెంటనే పూడ్చకపోతే వరిపంటకు నీరు అందక నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### మరమత్తులకు నిధులు మంజూరు కాలేదు

పంట కాల్వల మరమ్మతు కోసం రూ.5కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి 4 ఏళ్లక్రితమే పంపాం. ఇప్పటి వరకు నిధులు మంజూరు కాలేదు. దీంతో మరమ్మతు పనులు చేపట్టలేకపోయాం. ప్రధాన పంట కాల్వకు పడ్డ గండిని పూడ్చే పనులు వెంటనే చేపడతాం. రెండు రోజుల్లో వరి పంటకు సాగు నీరు అందిస్తాం.

**- శిఖామణి, ఎస్సార్బీసీ డీఈఈ, అవుకు**





# వైసీపీని వీడుతున్నారు..!



మాజీ ఎమ్మెల్సీ, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఇక్బాల్ టీడీపీలోకి ఆహ్వానిస్తున్న ఆ పార్టీ అధినేత చంద్రబాబు

- ఆ పార్టీని వదిలేస్తున్న మేధావివర్గం
- టీడీపీతోనే అభివృద్ధి సాధ్యం అంటున్న వైనం
- చంద్రబాబు సమక్షంలో రిటైర్డ్ డీఐజీ, ఎమ్మెల్సీ ఇక్బాల్ చేరిక
- లోకేశ్ సమక్షంలో చేరిన రిటైర్డ్ ఎస్ఈ కృష్ణారెడ్డి

**కర్నూలు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్రంలో అధికార వైసీపీకి కీలక నాయకులు గుడ్‌బై చెబుతున్నారు. ఇటీవలి కాలంలో కీలక నేతలు ఆ పార్టీని వీడి టీడీపీలో చేరుతున్నారు. నవ్యాంధ్ర అభివృద్ధి టీడీపీలోనే సాధ్యం.. సీఎం జగన్ విధానాలతో గాడి తప్పిన పాలనను సక్రమ మార్గంలో నడిపించడం టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు వల్లే అవుతుంది.. అభివృద్ధి, సంక్షేమం సమానంగా ముందుకు తీసుకెళ్లాలంటే చంద్రబాబు అనుభవం ఈ రాష్ట్రానికి ఎంతో అవసరం ఉందని వైసీపీలో ఉంటున్న మేధావివర్గం భావిస్తోంది. అందుకే ఆ పార్టీని ఒక్కొక్కరుగా వీడుతున్నారు. తాజాగా రిటైర్డ్ డీఐజీ, ఎమ్మెల్సీ షేక్ మహ్మద్ ఇక్బాల్, జలవనరుల శాఖలో సుదీర్ఘ అనుభవం కలిగిన రిటైర్డ్ సూపరింటెండెంట్ ఇంజనీరు (ఎస్ఈ), వైసీపీ సీనియర్ నేత కృష్ణారెడ్డిలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఇద్దరు చెబుతున్నది ఒక్కటే.. ఈ రాష్ట్రానికి జగన్ విధ్వంసకర పాలన నుంచి విముక్తి కలగాలి.. సుదీర్ఘ పాలన అనుభవం ఉన్న చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని. వీరి చేరికతో జిల్లాలో టీడీపీ బలం పెరిగిందని స్థానిక నాయకులు అంటున్నారు.

### ● చంద్రబాబు సమక్షంలో చేరిన ఇక్బాల్

ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన రిటైర్డ్ డీఐజీ (ఐపీఎస్), మాజీ ఎమ్మెల్సీ షేక్ మహ్మద్ ఇక్బాల్ వైసీపీకి రాజీనామా చేశారు. బుధవారం టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఆయన స్వగృహంలో టీడీపీలో చేరారు. ఆయనకు చంద్రబాబు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కర్నూలు డీఐజీగా రిటైర్మెంట్ పొందిన షేక్ మహ్మద్ ఇక్బాల్ గత ఎన్నికల్లో వైసీపీలో చేరారు. ఆ ఎన్నికల్లో శ్రీసత్యసాయి జిల్లా హిందుపురం నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి నందమూరి బాలకృష్ణపై ఓడిపోయారు. ఈ ఎన్నికల్లోనూ హిందూపురం నుంచే ఆయన వైసీపీ టికెట్‌ను ఆశించారు. అయితే ఆ పార్టీ అధినేత, సీఎం జగన్ కనీసం కలిసేందుకు కూడా అవకాశం ఇవ్వలేదు. దీంతో విరక్తి చెందిన ఇక్బాల్ కొన్నాళ్లుగా రాజకీయాలకు దూరంగా ఉంటూ వచ్చారు. అయితే రాష్ట్రంలో గాడి తప్పిన పాలనను సక్రమ మార్గంలో నడిపించడం చంద్రబాబు వల్లే సాధ్యమని గుర్తించిన ఆయన చంద్రబాబుకు మద్దతుగా టీడీపీలో చేరారు. ఆదోని పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో డిగ్రీ పూర్తి చేసిన ఇక్బాల్ గత చంద్రబాబు ప్రభుత్వంలో కర్నూలు డీఐజీగా పని చేసి ఇక్కడే పదవీవిరమణ పొందారు. ఆదోని, కర్నూలు, మంత్రాయలయం నియోజకవర్గాల్లో ఇక్బాల్‌కు బంధువర్గం ఉంది. ఈ ఎన్నికల్లో టీడీపీ పక్షాన ప్రచారం నిర్వహిస్తే చేస్తే టీడీపీకి కలసి వచ్చే అవకాశం ఉందని అంటున్నారు. ముఖ్యంగా ముస్లిం మైనార్టీ వర్గాల ఓటర్లను టీడీపీకి అనకూలంగా మార్చగలదని ఆ పార్టీ నాయకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

### ● కోడుమూరులో పెరిగిన టీడీపీ బలం

కోడుమూరు నియోజకవర్గంలో టీడీపీ బలంగా ఉంది. టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి ప్రచారంలో దూకుడు పెంచారు. ఇదే సమయంలో వైసీపీ నుంచి ముఖ్య నాయకులు టీడీపీలో చేరుతుండడంతో పార్టీ బలం మరింత పుంజుకుంటోంది.



యువనేత నారా లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నేత, రిటైర్డ్ ఎస్ఈ కృష్ణారెడ్డి

వైసీపీ ఆవిర్భావం నుంచి కోడుమూరు మండలంలో ఆ పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేసిన ఆ పార్టీ సీనియర్ నాయకులు, జలవనరుల శాఖ రిటైర్డ్ ఎస్ఈ అమడగుంట్ల కృష్ణారెడ్డి వైసీపీని వీడారు. టీడీపీ మాజీ ఇన్‌చార్జి విష్ణువర్ధన్‌రెడ్డితో కలసి మంగళవారం హైదరాబాద్‌కు చేరుకున్న కృష్ణారెడ్డి, ఆయన అన్న కుమారుడు, వైసీపీ నాయకుడు చెన్నారెడ్డిలు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, యువనేత నారా లోకేశ్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో వివిధ గ్రామాల నుంచి జడ్పీటీసీ, మాజీ జడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు సహా వైసీపీ నాయకులు, వామపక్ష పార్టీ నాయకులు టీడీపీలో చేరుతున్నారు. తాజాగా కృష్ణారెడ్డి వంటి సీనియర్ నాయకులు టీడీపీలో చేరి వైసీపీకి ఊహించని షాక్ ఇచ్చారు.

## మోటారు సైకిళ్ల ప్రమాదంలో వ్యక్తి మృతి

**బనగానపల్లె, ఏప్రిల్ 10:** బనగానపల్లె పట్టణ శివారులోని ఆర్ఆర్ ఫంక్షన్ హాల్ సమీపంలో ఎదురెదురుగా వస్తున్న రెండు మోటారు సైకిళ్లు ఢీకొన్నాయి. బుధవారం జరిగిన ఈ ప్రమాదంలో చాగలమర్రికి చెందిన హోల్‌సేల్ బంగారు వ్యాపారి జమాల్‌బాషా (30) మృతి చెందాడు. చాగలమర్రి వాసి జమాల్‌బాషా బనగానపల్లెలో పని ముగించుకొని మోటారు సైకిల్‌పై వెళ్తుండగా, బనగానపల్లె పట్టణానికి చెందిన తిరుపాలు కోవెలకుంట్ల నుంచి బనగానపల్లెకు వస్తున్నాడు. వీరి వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో జమాల్‌బాషా అక్కడికక్కడే మృతి చెందాడు. తిరుపాలుకు కాళ్లు విరిగిపోయాయి. ఈ ప్రమాదంలో మోటారుసైకిల్ నుజ్జునుజ్జు అయింది. జమాల్‌బాషా మృతదేహాన్ని బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. తిరుపాలుకు మెరుగైన వైద్యం కోసం నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## 13లోపు దరఖాస్తు చేసుకోవాలి

**కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 10:** ఎసెన్షియల్ సర్వీసెస్‌లో ఉన్న ఉద్యోగులందరూ పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకోడానికి ఈ నెల 13 చివరి రోజు అని కలెక్టర్ డా.జి.సృజన తెలిపారు. బుధవారం ఎన్నికల అంశం, ఉపాధి పనులపై రిటర్నింగ్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నియోజకవర్గ హెడ్ క్వార్టర్, తహసీల్దార్ కార్యాలయాల్లో, కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు నగరపాలక సంస్థ కార్యాలయాల్లో పోస్టల్ బ్యాలెట్ కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. 13 గ్రామ పంచాయతీలలో ఉపాధి హామీ పనులు ఎందుకు ప్రారంభించలేదని అధికారులను ప్రశ్నించారు.

## ఎండలతో అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

**కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 10:** రానున్న రోజుల్లో మరింత అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ జి. సృజన తెలిపారు. బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో వడగాల్పుల తీవ్రత నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా స్థాయి అధికారులు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల స్థాయి అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి వడగాలుల్లో జాగ్రత్తగా ఉండేలా ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. ఏప్రిల్‌లోనే 46, 47 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, వచ్చే నెలలో 50 డిగ్రీలకు చేరే అవకాశం ఉన్నందున ప్రజలు ఇళ్లలోనే ఉండేలా చూడాలన్నారు. ఉపాధి హామీ కూలీలు ఉదయం 10 గంటలలోపు పనులు ముగించుకుని, మిగిలిన పని సాయంత్రం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో మధుసూదన్‌రావు, ఏఎస్పీ నాగరాజు, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ రెడ్డి శేఖర్ రెడ్డి, డీపీఎం అనుపమ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, డ్వామా పీడీ అమర్నాథ్ రెడ్డి, డీపీవో నాగరాజు నాయుడు, డీఆర్‌డీఏ పీడీ సలీంబాషా, వ్యవసాయాధికారి వరలక్ష్మి, డీఎంహెచ్‌వో ప్రవీణ్ కుమార్, సమాచార శాఖ ఏడీ జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

### డెంగీ లక్షణాలతో విద్యార్థి మృతి

**ఉయ్యాలవాడ, ఏప్రిల్ 10:** మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న సురేంద్రకుమార్(13) డెంగీ వ్యాధి లక్షణాలతో మృతి చెందినట్లు విద్యార్థి తల్లి దండ్రులు బుధవారం తెలిపారు. గ్రామానికి చెందిన నాగన్న, వెంకటసుబ్బమ్మల కుమారుడు సురేంద్ర గత కొన్ని రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతున్నాడు. స్థానిక వైద్యశాలల్లో చికిత్స అందించినా నయం కాలేదు. దీంతో నంద్యాలలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లగా అక్కడి వైద్యులు డెంగీ అని గుర్తించారు. అక్కడి నుంచి హైదరాబాదుకు తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. ఈ మేరకు ఈ నెల 8వ తేదీన హైదరాబాదులోని రెయిన్‌బో వైద్యశాలలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక 9వ తేది మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

# రంజాన్‌కు మసీదులు ముస్తాబు

● ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు పూర్తి



**ఆత్మకూరు, ఏప్రిల్ 10:** రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆత్మకూరు పట్టణంలోని అన్ని మసీదులు ముస్తాబయ్యాయి. క్రొత్తపేట పెద్ద మసీదు, రహమత్ నగర్‌లోని మక్కా మసీద్, రహమానియా మసీద్, లక్ష్మీనగర్‌లో ఖుగ్రా మసీద్, బస్టాండ్ సమీపంలోని యాసీన్ మసీద్, మోమిన్ నగర్‌లోని మోమిన్ మసీద్, పెద్దకబేలా సమీపంలోని ఉమరేతారెఫ్ మసీద్, సంత మార్కెట్ సమీపంలోని ఆసర్‌మసీద్, నీలితొట్ల వీధిలోని మహ్మదీయమసీద్, అర్బన్ కాలనీలోని అతాయిరసూల్ మసీద్, శ్రీశైలం రస్తాలో ఉన్న మదరసామసీద్, నగర పంచాయతీ సమీపంలోని చౌక్‌మసీద్ తదితర కాలనీల్లో వున్న అన్ని మసీద్‌లను రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని విద్యుత్ అలంకరణతో తీర్చిదిద్దారు. అదేవిధంగా దుద్యాల రస్తాలో వున్న ఈద్గాను కూడా అలంకరించారు. ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించుకునేందుకు వీలుగా ఆయా మసీదుల నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కాగా అరబిక్‌దేశాల్లో మంగళవారం ఆకాశంలో నెలవంక దర్శనమివ్వడంతో బుధవారం రంజాన్ పర్వదినాన్ని పూర్తి చేశారు. దీంతో గురువారం ఆత్మకూరు ప్రాంతంలో జరిగే రంజాన్ వేడుకలను పురస్కరించుకుని అన్ని మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు. ప్రత్యేకించి పట్టణంలోని కొత్తపేటలో వున్న పెద్దమసీద్‌లో ప్రార్థనలకు సంబంధించి కమిటీ పెద్దలు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. అదేవిధంగా ఖబరస్తాన్‌లోని తమ పితరుల సమాధుల వద్దకు వెళ్లి పార్థనలు నిర్వహించి నివాళి అర్పిస్తారు. ఇదిలావుంటే రంజాన్ పర్వదినం సందర్భంగా నంద్యాల టర్నింగ్ వద్ద ఆయా రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో నాయకులు ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేయనున్నారు.



ఆత్మకూరులో ముస్తాబైన మసీదు, వెలుగోడులో ముస్లింల కోసం ఏర్పాటు చేసిన షామియానాలు

**వెలుగోడు, ఏప్రిల్ 10:** వెలుగోడు మండలంలో రంజాన్ పండుగను గురువారం నిర్వహిస్తున్నట్లు అంజుమన్ కమిటీ మత పెద్దలు తెలిపారు. ఈ మేరకు ప్రత్యేక ప్రార్థనలు చేసేందుకు ఈద్గా మైదానంలో ఏర్పాట్లను చేశారు. ఎండలు అధికంగా ఉండటంతో షామియానాలను ఏర్పాటు చేశారు. నెల రోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలు చేపట్టిన దీక్షలు బుధవారంతో ముగిశాయి. గురువారం రంజాన్ పండుగను నిర్వహిస్తున్నట్లు పెద్దలు తెలిపారు.

# టీడీపీ జెండా ఎగరడం ఖాయం

మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి



మాట్లాడుతున్న రాజశేఖర్‌రెడ్డి



టీడీపీలో చేరిన తిమోతి



వెలుగోడు: టీడీపీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి

**ఆత్మకూరు, ఏప్రిల్ 10:** రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో శ్రీశైల నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగురడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆత్మకూరు పట్టణ, మండల నాయకులతో సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, ఎప్పుడెప్పుడు సీఎం జగన్‌ని ఇంటికి పంపిద్దామా అని ప్రజలు ఎదురు చూస్తున్నారని అన్నారు. టీడీపీ విజయాన్ని ఎవరు ఆపలేరని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో మాజీ సర్పంచ్ కంచర్ల గోవిందరెడ్డి, టీడీపీ మండల, పట్టణాధ్యక్షులు శివప్రసాద్‌రెడ్డి, వేణుగోపాల్, కలీముల్లా, రజాక్, శాకమూరి గిరిరాజు, అబ్దుల్లాపురం పాల్గొన్నారు.

**టీడీపీలో చేరిన మాజీ కౌన్సిలర్ తిమోతి**

**ఆత్మకూరు, ఏప్రిల్ 10:** ఆత్మకూరులో అధికార వైసీపీకి మరో భారీ షాక్ తగిలింది. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ముఖ్య నాయకులు, వైసీపీ జిల్లా కార్యదర్శి మాజీ కౌన్సిలర్ వై.తిమోతి బుధవారం తన అనుచరగణంతో శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి మాజీ ఎమ్మెల్యే బుడ్డా టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలోకి చేరిన వారిలో సురేష్, కీర్తి, రాజు, వంశీ, కిశోర్, చెన్న కేశవ, జయమ్మ, జయలక్ష్మి, కృష్ణమ్మ, ప్రమీలమ్మ తోపాటు మరో 50 కుటుంబాల వారు ఉన్నారు.

కార్యక్రమంలో కంచర్ల గోవిందరెడ్డి, వేణుగోపాల్, అబ్దుల్లాపురం బాషా, నబిరసూల్, రాజారెడ్డి, మల్లికార్జునరెడ్డి, కొప్పరపు రవిప్రసాద్, మురళి, దినకర్, మున్నా, రవీంద్ర పాల్గొన్నారు.

● ఆత్మకూరు పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి సమక్షంలో పలు బుడగ జంగాల కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరాయి. ఈసందర్భంగా వారికి మాజీ ఎమ్మెల్యే బుడ్డా టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలోకి చేరిన వారిలో చిన్న జమ్మన్న, మల్లికార్జున, బలరామ్, శివలింగం, స్వామన్న, శ్రీను తదితరులు ఉన్నారు.

**టీడీపీ గెలుపే ధ్యేయంగా పని చేయాలి**

**వెలుగోడు, ఏప్రిల్ 10:** శ్రీశైల నియోజకవర్గంలో ప్రతి కార్యకర్త టీడీపీ గెలుపే ధ్యేయంగా పని చేయాలని శ్రీశైల నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. బుధవారం ఆయన టీడీపీ కార్యాలయ ఆవరణలో వెలుగోడు మండలంలోని ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో అన్నారపు శేషిరెడ్డి, ఖలీల్, అబ్దుల్‌కలాం, మాజీ ఎంపీపీ ఎల్లాల కృష్ణుడు, జాకిర్‌హుసేన్ హిదాయత్ మోమిన్ రసూల్, రఘుస్వామి రెడ్డి, క్రిష్టారెడ్డి, సుధాకర్‌రెడ్డి, భూపాల్ చౌదరి, రామానాయుడు పాల్గొన్నారు

**కొనసాగుతున్న చేరికలు**

**వెలుగోడు, ఏప్రిల్ 10:** మండలంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరికల పరంపర కొనసాగుతోంది. బుధవారం వెలుగోడు పట్టణంలోని సీపీ నగర్‌కు చెందిన సుమారు 30 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. టీడీపీ సీనియర్ నాయకులు అబ్దుల్ కలాం, కేశవగౌడ్, శంకర్‌రెడ్డి, కలిముల్లాల ఆధ్వర్యంలో సీపీ నగర్‌కు చెందిన పోచా వెంకటేశ్వరరెడ్డి, పోచా రామిరెడ్డి, మహేష్‌ఆచారి, శ్రీనివాసులు లింగేశ్వరరెడ్డి, డ్రైవర్ రాముడు, సత్యనారాయణరెడ్డి, ముర్తుజా, షాలు, ఆటో రామిరెడ్డితోపాటు 30 కుటుంబాలు చేరాయి. వీరు టీడీపీ అభ్యర్థి స్వగ్రామమైన వేల్పనూరులో బుడ్డా రాజశేఖరరెడ్డిని కలిసి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

## 30 నెలల పింఛన్ సొమ్ము స్వాహా

● వలంటీర్ తొలగింపు

**బండిఆత్మకూరు, ఏప్రిల్ 10:** వితంతువు కు పింఛన్ పంపిణీ చేయకుండా ఓ వలంటీర్ 30 నెలల సొమ్మును స్వాహా చేశాడు. ఎంపీడీవో విజయరావు వివరాల మేరకు.. మండలంలోని చిన్నదేవళాపురం గ్రామానికి చెందిన అడ్డాకుల విశ్రాంతమ్మకు వితంతువు పింఛన్ చెల్లించకుండా వలంటీర్ అడ్డాకుల కళ్యాణ్ నొక్కేశాడు. నెల నెలా ఆమెకు మాయమాటలు చెప్పి వేలిముద్రలు వేయించుకునేవాడు. ఇలా ఏకంగా 30 నెలల ఫింఛన్ సొమ్ము రూ.78,750 ఇవ్వకుండా కాజేశాడు. ఈ నెల ఎలక్షన్ కమీషన్ పుణ్యమా అని సివాలయ సిబ్బంది పించన్ సొమ్ము ఇవ్వటానికి వెళ్ళగా అసలు విషయం వెలుగు చూసింది. ఎంపీడీవో విజయరావు దృష్టికి సచివాలయ అధికారులు తీసుకెళ్లడంతో బుధవారం విచారణ చేపట్టారు. దీంతో 30 నెలలుగా సొమ్ము ఇవ్వలేదని తేలడంతో అతని వద్ద నుంచి రూ.80,000 రికవరీ చేశారు. ఆ సొమ్మును విశ్రాంతమ్మ బ్యాంక్ అకౌంట్లో జమ చేసి అతనిని విధుల నుంచి తొలగించారు.



చిన్నదేవళాపురంలో లబ్దిదారురాలు విశ్రాంతమ్మను విచారిస్తున్న ఎంపీడీవో విజయరావు

## ఓటుతోనే దృఢమైన ప్రజాస్వామ్యం

**ఆత్మకూరు, ఏప్రిల్ 10:** ఓటు వినియోగంతోనే ధృఢమైన ప్రజాస్వామ్యం అవతరిస్తుందని శ్రీశైలం నియోజకవర్గం రిటర్నింగ్ ఆఫీసర్ కే సుధారాణి అన్నారు. బుధవారం ఆత్మకూరు పట్టణంలో ఎన్నికల విభాగం అధికారులు ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ ఆర్టీసీ బస్టాండ్, కేజీ రోడ్డు మీదుగా గౌడ్ సెంటర్‌కు చేరుకుంది. అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు. అదేవిధంగా అర్హులైనవారు మిగిలిపోయి ఉంటే ఈ నెల 15వ తేదీలోగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతిలో కొత్తగా ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చునని సూచించారు.



ర్యాలీలో తహసీల్దార్ బాబు, ఎంపీడీవో శివప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ సిబ్బంది, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

↑ మాట్లాడుతున్న రిటర్నింగ్ ఆఫీసర్ సుధారాణి

## బ్రాహ్మణకొట్కూరులో ఇఫ్తార్



ఇఫ్తార్ విందు ఇస్తున్న గౌరు వెంకటరెడ్డి, జయసూర్య

**నందికొట్కూరు రూరల్,, ఏప్రిల్ 10 :** రంజాన్ పండుగ సందర్భంగా బ్రాహ్మణకొట్కూరులో టీడీపీ నాయకుడు గౌరు వెంకటరెడ్డి, నందికొట్కూరు టీడీపీ అభ్యర్థి జయసూర్య ముస్లింలకు బుధవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే కాలమంతా ఇక మంచి రోజులేనని అన్నారు. రాక్షస పాలనకు అంతం రాబోతుందని అన్నారు. రంజాన్ సందర్భంగా ప్రజలకు అంతా మంచి జరగాలని ఆకాంక్షిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రంజాన్ తోఫా పంపిణీ

**నందికొట్కూరు, ఏప్రిల్ 10:** వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో 130 కుటుంబాలకు రంజాన్‌తోఫా పంపిణీ చేశారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని బుధవారం పట్టణంలోని 13వ వార్డు హాజీ నగర్‌లో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో 130 పేద ముస్లిం కుటుంబాలకు వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు సంపంగి వెంకటేశ్వర్లు రంజాన్ తోఫాను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు సంపంగి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పేద ముస్లింలను గుర్తించి రంజాన్ పండుగను కుటుబ సభ్యులు జరుపుకోవాలని తోఫాను పంపిణీ చేస్తున్నామని అన్నారు.

## 14 నుంచి షర్మిల యాత్ర

**నంద్యాల టౌన్, ఏప్రిల్ 10 :** నంద్యాల, కర్నూలు జిల్లాల్లో ఈనెల 14వ తేదీ నుంచి 17వ తేదీ వరకు ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల యాత్ర ఉంటుందని డీసీసీ అధ్యక్షుడు జె.లక్ష్మీనరసింహ యాదవ్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఏపీ న్యాయ యాత్ర పేరుతో షర్మిల జిల్లా పర్యటనకు వస్తున్నారని అన్నారు. 14వ తేదీ ఆళ్లగడ్డ పట్టణంలో రోడ్ షో, బహిరంగ సమావేశం జరుగుతుందని తెలిపారు. 15వ తేదీ ఉదయం శ్రీశైలం నియోజకవర్గంలోని బండిఆత్మకూరు రోడ్‌షో, బహిరంగ సమావేశం, వెలుగోడులలో రోడ్‌షో, సాయంత్రం ఆత్మకూరు పట్టణంలో రోడ్‌షో, బహిరంగ సమావేశం జరుగుతుందని అన్నారు. 16వ తేదీ ఉదయం బ్రాహ్మణకొట్కూరు, గార్గేయపురం, కర్నూలులో రోడ్‌షో, భారీ బహిరంగ సభలో షర్మిల ప్రసంగిస్తారని తెలిపారు. 17వ తేదీ కల్లూరు చెన్నమ్మ సర్కిల్, వెల్దుర్తి, డోన్, కోడుమూరులలో రోడ్‌షో, భారీ బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని అసెంబ్లీ స్థానాలు, పార్లమెంట్ స్థానాలు కైవసం చేసుకోవడమే లక్ష్యంగా ఎన్నికల శంఖారావాన్ని కాంగ్రెస్ పార్టీ పూరించబోతున్నదని ఆయన స్పష్టం చేశారు.

## టీడీపీతోనే ముస్లింల అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న రాంమోహన్‌నాయుడు

**పాణ్యం, ఏప్రిల్ 10 :** టీడీపీతోనే ముస్లింల అభివృద్ధి జరిగిందని రాష్ట్ర టీడీపీ లీగల్ సెల్ కార్యదర్శి రాంమోహన్‌నాయుడు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన ముస్లిం మైనార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మఖాన్ దుఖాన్, మైనార్టీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ పథకాలు, మసీదుల అభివృద్ధికి టీడీపీ నిధులు కేటాయించిందని అన్నారు. దుల్హన్ పథకం ద్వారా పెళ్లి కానుక, రంజాన్ తోఫా, మసీదు ఇమాం, మౌజన్‌లకు వేతనాలు ఏర్పాటు చేసిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ సభ్యులు జాకీర్, సుభాన్, వార్డు సభ్యులు మదార్‌సా, నాయకులు చాంద్‌బాషా, నూర్‌బాషా, రబ్బాని, నజీర్‌హుసేన్, హుసేన్‌వలి, జుబేర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే శిల్పా వైఖరితో వలంటీర్ రాజీనామా

**ఆత్మకూరు, ఏప్రిల్ 10:** శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి వైఖరి నచ్చక ఆత్మకూరు మండలంలోని కరివేన గ్రామానికి చెందిన వలంటీర్ కిశోర్ రాజీనామా చేశారు. బుధవారం తన రాజీనామా పత్రాన్ని ఆత్మకూరు ఎంపీడీవో కార్యాలయ సూపరిన్‌డెంట్ మోహన్‌కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో గ్రామంలో జరిగిన ఎంపీటీసీ ఎన్నికల్లో తన తండ్రి జాను పోటీ చేసేందుకు నామినేషన్ దాఖలు చేసినట్లు చెప్పారు. అయితే ఆ సమయంలో తన తండ్రి నామినేషన్‌ను వెనక్కి తీసుకోవాలని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఒత్తిళ్లకు గురి చేశారని తెలిపారు. అలాగే ఈ నెల 17న బుడ్డా రాజశేఖరరెడ్డి సమక్షంలో తమ గ్రామ నాయకులతో కలిసి టీడీపీలో చేరనున్నట్లు ప్రకటించారు.

## బీసీవై అభ్యర్థిగా చింతలపల్లె సుధాకర్‌రావు

**నంద్యాల (నూనెపల్లె), ఏప్రిల్ 10:** నంద్యాల అసెంబ్లీకి భారత చైతన్య యువజన పార్టీ అభ్యర్థిగా చింతలపల్లె సుధాకరరావ్ పేరును ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు బోడే రామచంద్ర యాదవ్ ప్రకటించారు. ఈ సందర్భంగా బోడే రామచంద్ర యాదవ్‌ను సన్మానించారు.

## నేటి నుంచి విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం

**ఆత్మకూరు రూరల్, ఏప్రిల్ 10:** మండలంలోని బాపనంతాపురంలో ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు సీతారాముల నూతన దేవస్థానంలో విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవాన్ని చేపట్టనున్నట్లు నిర్వాహకులు బుధవారం తెలిపారు. 15వ తేదీన సోమవారం సీతా సమేత రామ, లక్ష్మణ, అభయాంజనేయ స్వామి వార్ల యంత్ర విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠను భక్తుల సమక్షంలో వైభవంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్న భక్తులకు సోమవారం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



## టీడీపీతోనే అభివృద్ధి: మాండ్ర



వడ్డెమానులో ప్రచారం నిర్వహిస్తున్న మాండ్ర తదితరులు

**నందికొట్కూరు రూరల్, ఏప్రిల్ 10 :** రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాలు పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందాలంటే టీడీపీతోనే సాధ్యమని టీడీపీ సీనియర్ నాయకులు మాండ్ర లింగారెడ్డి, నందికొట్కూరు టీడీపీ అభ్యర్థి జయసూర్య అన్నారు. బుధవారం నందికొట్కూరు మండలంలోని వడ్డెమాను గ్రామంలో ఎన్నికల శంఖారావం మాండ్ర లింగారెడ్డి, జయసూర్యల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు చంద్రబాబు ప్రవేశ పెట్టిన మినీ మ్యానిఫెస్టో, సూపర్ సిక్స్ పథకాల గురించి మహిళలు, గ్రామస్థులకు వివరించారు. వాటికి సంబంధించిన కరపత్రాలను ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాండ్ర సురేంద్ర నాథరెడ్డి, ముర్తుజావళి, పల్లె రఘురామిరెడ్డి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్ట్రాంగ్ రూమ్‌కు ఎన్నికల సామగ్రి



ఎన్నికల సామగ్రిని స్ట్రాంగ్ రూంకు తరలిస్తున్న సిబ్బంది

**నందికొట్కూరు, ఏప్రిల్ 10:** సార్వత్రిక ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రంలో ఉపయోగించే సామగ్రిని ఆర్వో కార్యాలయం నుంచి స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. బుధవారం ఉదయం నందికొట్కూరు నియోజకవర్గ ఆర్వో కేంద్రం నుంచి శ్లోకా స్కూల్‌లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌కు పోలింగ్ కేంద్రంలో ఉపయోగించే వివిధ రకాల సామగ్రిని తరలించారు.

## వీరాపురం, కొత్తమాడుగులలో ప్రచారం



వీరాపురంలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

**కొత్తపల్లి, ఏప్రిల్ 10:** మండలంలోని వీరాపురం, కొత్తమాడుగుల గ్రామాల్లో టీడీపీ నాయకులు బుధవారం ప్రచారం నిర్వహించారు. టీడీపీ అభ్యర్థి జయసూర్య ఆధ్వర్యంలో మొదటి విడత ఇంటింటి ప్రచారానికి ముగింపు పలికారు. ఈ సందర్భంగా టీడీపీ అభ్యర్థి జయసూర్య విలేకరులతో మాట్లాడారు. మండలంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ శంఖారావం కార్యక్రమాలకు ప్రజల నుంచి భారీ స్పందన లభించిందన్నారు. జగన్ అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక పాలనపై రాష్ట్ర ప్రజలు విసుగు చెందారని, టీడీపీ ప్రభుత్వం రాక కోసం ఎదురు చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, శ్రీనాథరెడ్డి, చిన్న పుల్లారెడ్డి, చంద్రశేఖర్ యాదవ్ (సర్పంచ్), నాగేశ్వరరావు యాదవ్, వెంకటస్వామి రెడ్డి, పరమేశ్వరరెడ్డి, జడ్ వెంకటరెడ్డి, రాధాకృష్ణారెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.

## నీటి సమస్యను పరిష్కరించండి



నీటి సమస్యపై అధికారులతో మాట్లాడుతున్న కాలనీ వాసులు

**పగిడ్యాల, ఏప్రిల్ 10:** మండల పరిధిలోని పడమర ప్రాతకోట ఎస్సీ కాలనీలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు అధికారులను కోరారు. గ్రామంలో నెలకొన్న నీటి సమస్య పరిష్కారం కోసం ఆర్‌డబ్ల్యూస్ ఏఈ శివకుమార్, పంచాయతీ కార్యదర్శి ఇషామ్ ఎస్సీ, బీసీ కాలనీలో బుధవారం పర్యటించారు. అధికారులు కాలనీలో పర్యటించడంతో కాలనీ వాసులు 15 రోజుల నుంచి నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. ఆయా కాలనీలో నీటి సమస్యకు గల కారణాలను తెలుసుకొని ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

## శ్రీరాముడు ఆదర్శమూర్తి



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న డా. దివి హయగ్రీవాచార్యులు

**నంద్యాల (కల్చరల్), ఏప్రిల్ 10:** మనిషిగా పుట్టిన ప్రతి వ్యక్తి తాను సమాజంలో ఎలా నడుచుకోవాలో తాను ఆచరించి చూపిన ఆదర్శమూర్తి కాబట్టే సర్వమానవాళికి శ్రీరాముడు ఆరాధ్య దైవం అయ్యాడని ప్రముఖ వ్యాఖ్యాత డాక్టర్ దివి హయగ్రీవాచార్యులు అన్నారు. టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో నంద్యాల ఎస్‌బీఐ కాలనీలోని రామాలయంలో బుధవారం శ్రీమద్రామాయణ ప్రవచనా సప్తాహ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మల్లు వెంకటరెడ్డి, డా.రామక్రిష్ణారెడ్డి, రామిరెడ్డి, మారం వెంకట శేషయ్య, భార్గవ రామశర్మ, ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

## మూల పెద్దమ్మ జాతర ప్రారంభం



బోనాలు తీసుకెళ్తున్న వాల్మీకులు

**గడివేముల, ఏప్రిల్ 10:** మండల కేంద్రంలో మూల పెద్దమ్మ జాతర బుధవారం ఘనంగా ప్రారంభమైంది. అమ్మవారికి అర్చకులు ఆకుపూజ, కుంకుమార్చన పూజలు చేశారు. మంగళవాయిద్యాలతో ఘటానికి వెళ్లారు. అనంతరం గడివేములలోని వాల్మీకులు తమ ఇంటి వద్ద నుంచి బోన కుండలను మంగళవాయిద్యాలతో ఆలయానికి తీసుకెళ్లారు. ఆలయ అర్చకు లు బోన కుండలను అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. బోన కుండల సమర్పన అనంతరం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి ముడుపులు చెల్లించారు. జాతర సంద ర్భంగా అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఎస్ఐ బీటీ వెంకటసుబ్బయ్య పోలీసు బందోబస్తు నిర్వహించారు.

# డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

## బాట సుంకులమ్మకు పూజలు



బాట సుంకులమ్మకు పూజలు చేస్తున్న బీసీ రాజారెడ్డి

**బనగానపల్లె, ఏప్రిల్ 10:** బనగానపల్లె మండలం రాళ్లకొత్తూరు గ్రామ సమీపంలోని బాటసుంకులమ్మ ఆలయంలో మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి, బీసీ రామనాథరెడ్డి బుధవారం పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. గోకులదిన్నె గ్రామానికి చెందిన ద్వారం బాలతి మ్మారెడ్డి ఆహ్వానం మేరకు బాటసుంకులమ్మను దర్శించుకున్నారు. కార్యక్ర మంలో టీడీపీ నాయకులు బాలిరెడ్డి, కృష్ణారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మధు, సాంబశివుడు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

**నివాళి:** బనగానపల్లె పట్టణానికి చెందిన ఉర్దూ టీచర్ సయ్యద్ ఫయాజ్ తల్లి హసీనాబేగం(75) బుధవారం అనారోగ్యంతో మృతి చెందిం ది. ఆమె భౌతికకాయానికి మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి నివాళి అర్పించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు అమీర్‌జాన్, చైనా ఉన్నారు.

## టీడీపీతోనే పేదల సంక్షేమం

**చాగలమర్రి, ఏప్రిల్ 10:** టీడీపీతోనే పేదల సంక్షేమమని టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు, మండల బీసీ సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్ అన్నారు. బుధవారం బీసీ సంఘజ కార్యాలయంలో వారు మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తే సూపర్-6 పథకాలు పేదలందర్జికీ అందుతాయని అన్నారు. వైసీపీ అరాచక పాలనకు సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభం

**చాగలమర్రి, ఏప్రిల్ 10:** చాగలమలోని పెన్షనర్ల సంఘం కార్యాలయం వద్ద ఎస్టీయూ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని పెన్షనర్ల సంఘ అధ్యక్షుడు పోలిశెట్టి బుధవారం ప్రారంభించారు. ఎండలు అధికంగా ఉండటంతో దాహం తీర్చేందుకై చలివేంద్రం ఏర్పాటు చేశామని అన్నారు. విద్యార్థులు, ప్రయాణికులు పలువురికి తాగునీటి సౌకర్యం కల్పించేందుకు చలివేంద్రం ఏర్పాటు చేశామని అన్నారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘ సభ్యులు సుబ్బారెడ్డి, పుల్లయ్య, రంగయ్య, సుబ్బారెడ్డి, ఆంతోనమ్మ, కొండారెడ్డి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల నియమావళి తప్పనిసరి

**చాగలమర్రి, ఏప్రిల్ 10:** గ్రామాల్లో ఆయా పార్టీ నాయకులు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని ఎంపీడీవో సూర్యానారాయణరెడ్డి అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సభలు, సమావేశాలు, ఎన్నికల ప్రచారాలపై అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని అన్నారు. ఫ్లెక్సీలు, జెండాలు, స్టిక్కర్లు ఉంచరాదని అన్నారు. కార్యక్రమంలో ఎంపీసీ సహాయ అధికారులు పాల్గొన్నారు.

## పశువుల వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

**చాగలమర్రి, ఏప్రిల్ 10:** వేసవి కాలంలో పశువుల్లో వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి సాయిబాబా సూచించారు. బుధవారం చాగలమర్రి పశువైద్య కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ఎండలు అధికంగా ఉండటంతో మూగ జీవాలు వడదెబ్బ బారిన పడే ప్రమాదం ఉందని అన్నారు. మూగ జీవాలను ఎండలో లేకుండా నీడనిచ్చే ప్రదేశాల్లో ఎక్కువగా ఉంచాలని సూచించారు. వడదెబ్బకు గురైన వెంటనే వైద్య చికిత్స అందించాలని అన్నారు. రైతులు పశు బీమాను తప్పనిసరిగా చేయించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది ఉన్నారు.



# ప్రజలను పాతాళానికి తొక్కేసిన వైసీపీ

### మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ

**డోన్, ఏప్రిల్ 10:** వైసీపీ ప్రభుత్వం ప్రజలను పాతాళానికి తొక్కేసిందని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. బుధవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో కొత్తకోట గ్రామానికి చెందిన వైసీపీ వార్డు సభ్యులు పుల్లారెడ్డి, లక్ష్మీరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, విజయభాస్కర్, తిరుపతయ్య, నరేంద్ర, సంజీవరా యుడు, వెంకట్రాముడుతో పాటు మరో 20 కుటుంబాలు కోట్ల సుజాతమ్మ సమక్షంలో కొత్తకోట శ్రీను ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా కోట్ల సుజాతమ్మ మాట్లాడుతూ సీఎం జగన్ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చి రాష్ట్ర ప్రజల భవిష్యత్తును నాశనం చేశారని మండిపడ్డారు. ఇసుక, లిక్కర్, మైనింగ్ గనులు భూములను కొల్లగొట్టి వైసీపీ నాయకులు భారీగా దోచుకున్నారని ఆరోపించారు. డోన్ నియోజకవర్గంలో కరువు రైతాం గాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత మంత్రి బుగ్గనకు



టీడీపీలో చేరిన వారితో కోట్ల సుజాతమ్మ

లేదా అని ఆమె ప్రశ్నించారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, విజయకుమార్‌రెడ్డి, రంజిత్ కిరణ్ పాల్గొన్నారు.

## వైభవంగా సుంకులమ్మ తిరుణాల



సుంకులమ్మకు పూజలు నిర్వహిస్తున్న మహిళలు

**సంజామల, ఏప్రిల్ 10:** మండలంలోని కానాల గ్రామంలో సుంకులమ్మ తిరుణాల బుధవారం ప్రారంభమయ్యాయి. ఉగాది మరునటి రోజు నుంచి రెండు రోజుల పాటు తిరుణాలను నిర్వహిస్తారు. బుధవారం ఉదయం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. కర్నూలు, నంద్యాల కడప జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శిం చుకొని మొక్కులు తీర్చుకున్నారు. గురువారం సాయంత్రం నాటికి అమ్మవారి తిరుణాలు ముగుస్తాయి. ఈ ఏడాది ఎన్నికలు రావడంతో ఈసీ ఆదేశాల మేరకు సాంస్కృతిక కార్యక్రమాలు ఎద్దుల పోటీలు నిర్వహించలేకపోయారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ రమేష్ రెడ్డి పోలీసు బందోబస్తు నిర్వహించారు.

## శక్తి దేవతలకు పూజలు



ఉయ్యాలవాడలో మారెమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

**ఉయ్యాలవాడ, ఏప్రిల్ 10:** మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం శక్తి దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. ఉయ్యాలవాడలో మారెమ్మకు, ఇంజేడు గ్రామంలో గంగమ్మకు, మాయలూరులో పెద్దమ్మ, రూపనగుడిలో సుకులమ్మలకు పూజలు చేశారు. అమ్మవారికి అభిసేకం అలంకరణ చేసి నైవేద్యం సమర్పించారు. అర్చకులు హారతి ఇచ్చి తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు.

**గ్రామ దేవతలకు..**

**రుద్రవరం:** మండలంలోని పలు గ్రామాలలో గ్రామ దేవతలకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రుద్రవరం, కొండమాయపల్లె, యలవదుల, కోటకొండ, చినకములూరు, పెద్ద కములూరు, ఆలమూరు, శ్రీరంగాపురం గ్రామాలలో పెద్దమ్మ, సుంకులమ్మ, మారెమ్మ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## త్వరలో డోన్‌కు ఈవీఎంలు

**డోన్, ఏప్రిల్ 10:** ఈ నెల 12వ తేదీన నంద్యాల పార్లమెంటుకు సంబంధించిన ఈవీఎంలు డోన్‌కు చేరుకుంటాయని ఎన్నికల రిటర్నింగ్ అధికారి మహేశ్వరరెడ్డి బుధవారం తెలిపారు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియకు సంబంధించి 12న నంద్యాల మార్కెట్ యార్డులో కలెక్టర్ ఆధ్వర్యంలో ఈవీఎంల మొదటి దశ ర్యాండమైజేషన్ జరుగుతుందని తెలిపారు. గుర్తింపు పొందిన డోన్ నియోజకవర్గ రాజకీయ పార్టీ ప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని తెలిపారు. ఈనెల 12న నంద్యాల పార్లమెంటుకు సంబంధించిన ఈవీఎంలను డోన్ పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలలో స్ట్రాంగ్ రూములలో భద్రపరుస్తున్నట్లు తెలిపారు. 13న అసెంబ్లీకి సంబంధించిన ఈవీఎంలు డోన్‌కు చేరుకుంటాయని, వాటిని కూడా ప్రభుత్వ ఐటీఐలలోని స్ట్రాంగ్ రూములలో భద్రపరుస్తున్నట్లు తెలిపారు. ఈవీఎం స్ట్రాంగ్ రూముల వద్ద పోలీసు పహారా ఏర్పాటు చేస్తున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి మహేశ్వరరెడ్డి తెలిపారు.

## 'కొండముచ్చు బెడద తప్పించండి'

**డోన్(రూరల్), ఏప్రిల్ 10:** గత మూడు రోజులుగా పట్టణ ప్రజలపై దాడి చేసి గాయపరుస్తున్న కొండముచ్చు బెడద నుంచి రక్షణ కల్పించాలని డోన్ కాంగ్రెస్ నియోజక వర్గ సమన్వయకర్త గార్లపాటి మద్దిలేటి కోరారు. బుధవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ గత మూడు రోజులుగా పట్టణంలోని పాతపేట, ఇందిరానగర్ తదితర కాలనీల్లో ప్రజలను కొండముచ్చు భయభ్రాంతులకు గురి చేస్తున్నదని అన్నారు. డోన్ సమీప కొండ ప్రాంతాల్లో వేసవి కాలం కావడంతో తాగునీరు లేక కొండముచ్చులు జనా వాసాల మధ్యకు వచ్చి ప్రజలపై దాడి చేస్తున్నాయన్నారు. అటవీ శాఖ అధికారులు స్పందించి కొండముచ్చును దూరంగా అడవుల్లో వదిలివేయాలని ఆయన కోరారు.

## దూదేకుల సంఘం అభివృద్ధికి కృషి

**నంద్యాల, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి):** నంద్యాల దూదేకుల కులస్థుల సంక్షేమానికి, సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని నూతన జిల్లా అధ్యక్షుడు శిల్పి సుబ్బరాయుడు అన్నారు. రాష్ట్ర దూదేకుల సంఘం అధ్యక్షుడు సయ్యద్ బాజి ఆదేశాల మేరకు ఈయనను ఎన్నుకున్నామని ఆళ్లగడ్డ తాలుకా అధ్యక్షుడు దస్తగిరి బుధవారం చెప్పారు. నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుని ఆదేశాల మేరకు నడుచుకొని సంఘానికి పేరు ప్రతిష్ఠలు తెస్తానన్నారు..

## టీడీపీ విజయానికి కృషి చేయండి

**నంద్యాల, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి):** త్వరలో జరుగునున్న అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ విజయానికి కృషి చేయాలని ఆ పార్టీ యువ నాయకుడు భూమా విఖ్యాత్‌రెడ్డి కోరారు. బుధవారం ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన గీతా సొసైటీ మాజీ అధ్యక్షుడు సోముల శ్రీనివాసరెడ్డి, ఆయన సోదరుడు సోముల రామకృష్ణారెడ్డిలతోపాటు 40 కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి విఖ్యాత్‌రెడ్డి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. టీడీపీ గెలిస్తే ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందని ఆయన అన్నారు.

## పని చేసే నాయకులను ఎన్నుకోవాలి

**శిరివెళ్ల, ఏప్రిల్ 10:** ప్రజల కోసం పని చేసే నాయకులను ఎన్నుకోవాలని మాజీ మంత్రి, టీడీపీ ఆళ్లగడ్డ నియోజకవర్గ అభ్యర్థి భూమా అఖిలప్రియ అన్నారు. మండలంలోని గోవిందపల్లెలో మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చాక యువతకు ఉద్యోగాలు కరువై ఇతర రాష్ట్రాలకు వలస వెళ్తున్నారని అన్నారు. రైతులకు సరైన గిట్టుబాటు ధర లేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. ప్రజల కోసం సేవ చేసే వలంటీర్లను టీడీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక కొనసాగించడంతోపాటు వారికి రూ.10 వేలు గౌరవ వేతనం అందిస్తామని అన్నారు. టీడీపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుంటేనే రాష్ట్ర భవిష్యత్తు బాగుంటుందని ప్రజలు ఎదురు చూస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మురళి, గంగదాసరి శ్రీనివాసరెడ్డి, రవిచంద్రారెడ్డి, లక్ష్మీరెడ్డి, సంగిరెడ్డి నాగేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా చెన్నకేశవస్వామి కల్యాణం

**బనగానపల్లె, ఏప్రిల్ 10:** మండలంలోని నందవరం చౌడేశ్వరీ మాత తిరుణాల సందర్భంగా రెండో రోజు బుధవారం రాత్రి 9గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో కామేశ్వరమ్మ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. గుద్దేటి చిన్నరామసుబ్బారెడ్డి కుమారుడు సూర్యానారాయణరెడ్డిచే సంప్రదాయ బద్ధంగా కల్యాణం నిర్వహించారు. అనంతరం గ్రామంలో అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు.

## వైసీపీ నీచ రాజకీయాలు చేస్తోంది

**శిరివెళ్ల, ఏప్రిల్ 10:** వైసీపీ నీచ రాజకీయాలు చేస్తోందని టీడీపీ క్రిష్టియన్ సెల్ నంద్యాల పార్లమెంట్, అసెంబ్లీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు దువ్వూరి భాస్కర్ అన్నారు. శిరివెళ్లలోని ఎస్సీ కాలనీకి చెందిన పలువురు వ్యక్తులు టీడీపీని వీడి ఎమ్మెల్యే సమక్షంలో వైసీపీలో చేరారని ప్రచారం చేసుకుంటుండటాన్ని ఆయన ఖండించారు. వైసీపీ పాలన నచ్చక ప్రజలు స్వచ్ఛందంగా టీడీపీలోకి తరలి వస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ యామా గుర్రప్ప, కొల్లి బాలజోజి పాల్గొన్నారు.

## వైభవంగా పారువేట

**కొలిమిగుండ్ల రూరల్, ఏప్రిల్ 10:** మండలంలోని వివిధ గ్రామాలలో ఉగాది పర్వదిన పారువేట ఉత్సవాలు బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బెలుం, సింగవరం వీరబాపులమ్మ తల్లి, మీర్జాపురం సుం కులమ్మ, అబ్దుల్లాపురం పెద్దమ్మ తల్లి, కనకాద్రిపల్లె అంకాలమ్మ తల్లి, తదితర గ్రామదేవతల ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లతో అమ్మవారి ఆలయాల చుట్టూ ప్రదక్షిణ చేశారు.

## సచివాలయంపై సీఎం జగన్ బొమ్మ



కోటకొండ సచివాలయంపై జగన్ బొమ్మ

**రుద్రవరం, ఏప్రిల్ 10 :** మండలంలోని కోటకొండ సచివాలయంపై సీఎం జగన్ బొమ్మ అలాగే ఉంచడం ఎన్నికల ఉల్లంఘన కాదా అని పలువులు విమర్శిస్తున్నారు. మార్చి 16న ఎన్నికల కోడ్ అమలైనా అధికారులు కోడ్‌ను అమలు చేయడంలో విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

## నేడు రంజాన్

### ముస్తాబైన ఈద్గాలు



రుద్రవరంలో ఈద్గా వద్ద నమాజ్‌కు ఏర్పాటు చేసిన టెంట్లు

**చాగలమర్రి, ఏప్రిల్ 10:** చాగలమర్రిలోని అడ్డవాగు సమీపంలో రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలు ప్రార్థనలు చేసేందుకు ఈద్గాను ముస్తాబు చేశారు. పంచాయతీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు ఈద్గా వద్ద పరిసరాలను పరిశుభ్రం చేశారు. బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఈద్గా ముందు చలువ పందిర్లను ఏర్పాటు చేశారు. గురువారం ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తామని ప్రభుత్వ ఖాజీ యూనస్ తెలిపారు. ముస్లింలు ఈద్గా వద్దకు తరలివచ్చి ప్రార్థనలు చేయాలని కోరారు.

**రుద్రవరం:** మండలంలో రంజాన్ సందర్భంగా గురువారం జరిగే ముస్లింల ప్రార్థనల కోసం ఆయా గ్రామాలలో ఈద్గాలను ముస్తాబు చేశారు. ప్రార్థనలో పాల్గొనే వారికి ఎండ తాకిడి లేకుండా వద్ద ప్రత్యేక టెంట్లు ఏర్పాటు చేశారు. ఈద్ - ఉల్ - ఫితర్‌కు వచ్చే ముస్లింలు వేసవి తాకిడికి ఉపశమనానికి టెంట్లు ఏర్పాటు చేశారు. రుద్రవరం, ఆలమూరు, మందలూరు తదితర గ్రామాలలో ప్రార్థనలో పాల్గొనే ముస్లింలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

**బేతంచెర్ల:** పవిత్ర రంజాన్ మాసం నెలవంక దర్శనమివ్వ డంతో గురువారం ముస్లింలు రంజాన్‌ను వైభవంగా నిర్వహించనున్నట్లు మండల ఖాజీ నూర్ అహ్మద్ తెలిపారు. బుధవారం పట్టణంలోని జెండా మసీదులో ముస్లింలతో ఆయన సమావేశమై మాట్లాడుతూ ఉదయం 8.30 గంటలకు ఈద్గాకు చేరుకోవాలన్నారు.

**సంజామల:** నెలరోజుల పాటు ఉపవాస దీక్షలో ఉన్నా ముస్లింలు గురువారం దీక్షను విరమించి రంజాన్‌ను ఘనంగా జరుపుకుంటారు. మండలంలోని అన్ని గ్రామాలల్లో ముస్లింలు గురువారం ఉదయం ఈద్గాల వద్దకు వెళ్లి ప్రత్యేక నమాజులు చేసి పేదలకు దానధర్మాలు చేస్తారు.

## అఖిలప్రియ, శబరి విజయానికి కృషి

**నంద్యాల, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి):** త్వరలో జరుగనున్న అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ఆళ్లగడ్డ టీడీపీ అభ్యర్థి అఖిలప్రియ, నంద్యాల పార్లమెంటు టీడీపీ అభ్యర్థి శబరి విజయానికి కృషి చేస్తామని జనసేన పార్టీ ఆళ్లగడ్డ ఇన్‌చార్జి ఇరిగెల రాంపుల్లారెడ్డి సోదరులు స్పష్టం చేశారు. నందికొట్కూరు మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి మధ్యవర్తిత్వంలో భూమా, ఇరిగెల కుటుంబాలు బుధవారం కర్నూలులో కలిసిపోయాయి. ఈ సందర్భంగా రాంపుల్లారెడ్డి మాట్లాడుతూ 33 ఏళ్ల తరువాత భూమా కుటుంబం విజయానికి కృషి చేసే అవకాశం వచ్చిందన్నారు. కొందరి చెప్పుడు మాటలతో భూమా, ఇరిగెల కుటుంబాల మధ్య వైరం ఏర్పడిందని ఆవేదనతో అన్నారు. ఇపుడు రెండు కుటుంబాల మధ్య ఎలాంటి వైరం లేదని, అఖిలప్రియ విజయానికి శాయశక్తుల కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. అలాగే నంద్యాల పార్లమెంటు టీడీపీ అభ్యర్థి బైరెడ్డి శబరికి ఆళ్లగడ్డ నియోజకవర్గం నుంచి మంచి మెజార్టీ తెస్తామని చెప్పారు. కార్యక్రమంలో నంద్యాల పార్లమెంటు టీడీపీ అభ్యర్థి బైరెడ్డి శబరి, అఖిలప్రియ భర్త బార్గవ్‌రామ్‌నాయుడు, ఆమె సోదరుడు విఖ్యాత్‌రెడ్డి, ఇరిగెల సోదరులు విశ్వనాథరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, ప్రతాపరెడ్డి, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బైరెడ్డి రాజశేఖరరెడ్డి సమక్షంలో ఒక్కటైన భూమా, ఇరిగెల కుటుంబాలు

## కోట్లను కలిసిన బస్తిపాటి నాగరాజు



కోట్లను కలిసిన టీడీపీ ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు

**డోన్, ఏప్రిల్ 10:** కర్నూలు పార్లమెంటు టీడీపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు బుధవారం డోన్ పట్టణంలోని కోట్ల నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసారు. కర్నూలు పార్లమెంటు పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో పూర్తి సహకారాలు అందించాలని కోట్లను కోరారు. ఈసందర్భంగా కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్ని రకాలుగా సహకారాలు అందిస్తానని భరోసా ఇచ్చారు. కోట్లను కలిసిన వారిలో టీడీపీ నాయకులు ఆలేబాదు పరమేష్, మల్లికార్జున ఉన్నారు.

## ముస్లింలకు ఇఫ్తార్ విందు

**ప్యాపిలి, ఏప్రిల్ 10:** మండలంలోని జలదుర్గం గ్రామంలో బుధవారం టీడీపీ నాయకులు ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి కూతురు కోట్ల నివేదితరెడ్డి పాల్గొని ముస్లింలకు భోజనం వడ్డించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీతోనే ముస్లింల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆర్‌ఈ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

**కోవెలకుంట్ల, ఏప్రిల్ 10:** చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గడ్డం రామకృష్ణా రెడ్డి అన్నారు. బుధవారం కోవెల కుంట్లలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఒక్క చాన్సు పేరుతో అధికారం లోకి వచ్చిన సీఎం జగన్ పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో విఫలమయ్యారని అన్నారు. వైసీపీ పాలనలో పెట్రోలు, డీజల్, గ్యాస్, నిత్యావసరాల ధరలు పెంచి ప్రజలపై అధిక భారం మోపారన్నారు. వైసీపీ పాలనలో అభివృద్ధి 30 ఏళ్ళు వెనక్కి పోయిందన్నారు. మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ గడ్డం రామకృష్ణా రెడ్డి అమడాల మద్దిలేటి గడ్డం అమర్‌నాథ్ రెడ్డి వల్లంపాడు సర్పంచ్ జగదీశ్వరరెడ్డి పాల్గొన్నారు.

## టీడీపీ కార్యకర్త మృతి

**బేతంచెర్ల, ఏప్రిల్ 10:** మండలంలోని బలపాలపల్లె గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త, డోన్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు అంజి (38) అనారోగ్యంతో బుధవారం సాయంత్రం మృతి చెందాడు. ఈయన గత కొంత కాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ ఉండేవాడని, ఇటీవల రక్తకణాలు తక్కువగా ఉన్నాయని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకున్నారని టీడీపీ నాయకులు తెలిపారు. మంగళవారం తల్లి మృతి చెందడంతో.. బుధవారం కుమారుడు కూడా మృతి చెందడం ఆయన కుటుంబంలో విషాద ఛాయలు అలముకున్నాయి. విషయం తెలిసిన వెంటనే టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎస్సీ సెల్ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని అంజి భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శిం చారు.

## 9 మద్యం బాటిళ్లు స్వాధీనం

**బేతంచెర్ల, ఏప్రిల్ 10:** మండలంలోని ముద్దవరం గ్రామానికి చెందిన గుమ్మ రమేష్ అనే వ్యక్తి అక్రమ మద్యం విక్రయిస్తుండగా బుధవారం బేతంచెర్ల ఎస్ఐ శివశంకర్ నాయక్ దాడి చేసి అతడిని అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 9 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, డోన్ కోర్టులో హాజరు పరచగా రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్ఐ తెలిపారు.

## ప్రశాంత ఎన్నికల నిర్వహణకు సహకరించండి



అహోబిలంలో సీఆర్‌పీఎఫ్ సిబ్బందితో కవాతు నిర్వహిస్తున్న రూరల్ సీఐ

**నంద్యాల, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి):** త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని ఆళ్లగడ్డ రూరల్ సీఐ హనుమంత నాయక్ కోరారు. రూరల్ ఎస్ఐ నరసింహులు, సీఆర్‌పీఎఫ్ సిబ్బందితో కలిసి సమస్యాత్మక గ్రామమైన అహోబిలంలో బుధవారం కవాతు నిర్వహించారు. ఎన్నికల్లో అల్లర్లకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**ప్యాపిలి:** పట్టణంలో బుధవారం బీఎస్ఎఫ్ పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ జగదీశ్వరరెడ్డి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్ని కల నేపథ్యంలో మండలంలోని గ్రామాల్లో కవాతు నిర్వహించామన్నారు. మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిఘా ఉంచామన్నారు. బీఎస్ఎఫ్ పోలీసులు, స్థానిక పోలీసులు, హోంగార్డులు పాల్గొన్నారు.

## ఘనంగా బోనాల పండుగ



చాగలమర్రిలో పెద్దమ్మకు పూజలు చేస్తున్న ప్రజలు

**చాగలమర్రి, ఏప్రిల్ 10:** మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. చాగలమర్రిలోని పెద్దమకానం వీధిలో వెలసిన పెద్దమ్మకు పెద్ద ఎత్తున ప్రజలు, మహిళలు తరలి వెళ్లి పూజలు చేశారు. మహిళలు బోనాలు నెత్తిన పెట్టుకొని వీధుల గుండా ఊరేగింపుతో పెద్దమ్మ ఆలయానికి చేరుకొని పూజలు చేశారు. మరికొందరు మూగ జీవాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. అలాగే చాగలమ్మ, చౌడేశ్వరిదేవి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తి నరసింహులు, బీసీ సంఘం మాజీ అధ్యక్షుడు రామతీర్థం పాల్గొన్నారు.

## పాఠశాలల్లో టోఫెల్ పరీక్షలు



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

**చాగలమర్రి, ఏప్రిల్ 10:** ఆంగ్ల భాషలో విద్యార్థుల నైపుణ్యం పెంచేందుకు ప్రభుత్వం ప్రవేశ పెట్టిన టోఫెల్ ప్రిపరేటరి సర్టిఫికేషన్ పరీక్షలను బుధవారం ఆయా పాఠశాలల్లో నిర్వహించారు. 3, 4, 5 తరగతుల విద్యార్థులకు టోఫెల్ పరీక్షలు నిర్వహించినట్లు ఎంఈవో అనూరాధ తెలిపారు. మూడు వేల మంది విద్యార్థులు టోఫెల్ పరీక్షకు హాజరైనట్లు ఎంఈవో పేర్కొన్నారు. 12వ తేదీన 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు టోఫెల్ పరీక్ష రెండో విడత నిర్వహిస్తామని అన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు, విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించేందుకు టోఫెల్ పరీక్ష నిర్వహిస్తు న్నామని అన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శేషాద్రి, సీఆర్పీ ఖాసీం పాల్గొన్నారు.

## మండల విద్యాధికారి-2గా రామనర్సప్ప



**డోన్(రూరల్), ఏప్రిల్ 10:** డోన్ మండల విద్యాధికారి-2 గా రామనర్సప్ప బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో మండల విద్యాధికారి-2గా పని చేస్తున్న రాజేశ్వరి పదవీ విరమణ పొందడంతో ఆమె స్థానంలో డోన్ కొత్త పేట జడ్పీహై స్కూల్ హెడ్‌మాస్టర్ రామనర్సప్ప మండల విద్యాధికారి-2గా నియమించారు. ఈ మేరకు బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.